
# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
10 | నిజామాబాద్, గురువారం 13 మార్చి 2025 | KAMAREDDY


## విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

ఉత్తర్వుల్లో నిజామాబాద్‌కు బదులుగా మరో జిల్లా పేరు




ఖలీల్‌వాడి, మార్చి 12 : ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2024–25 విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ గ్రాంట్స్ వనరుల వినియోగ బాధ్యతలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర పథక సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్‌కు పంపిన ఉత్తర్వుల్లో నిజామాబాద్‌కు బదులుగా కొత్తగూడెం భద్రాద్రి జిల్లా తప్పుగా ఉన్నది. దీనిని విద్యాశాఖ సంచాలకులు చూసుకోకపోవడం గమనార్హం.

## ఎమ్మెల్సీ కవితకు బర్త్ డే కానుక



ఖలీల్‌వాడి, మార్చి 12 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన రాజశేఖర్ తన రక్తంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటాన్ని గీయించి అభిమానాన్ని చాటుకున్నాడు. నేడు (గురువారం) ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజును పురస్కరించుకొని ఆమెను హైదరాబాద్‌లోని నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఫ్రేమ్ కట్టించిన చిత్రపటాన్ని బహూకరించి, ఎమ్మెల్సీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపాడు.



- సాగునీరందక ఎండిపోతున్న పంటలు
- ఇంకిపోతున్న భూగర్భ జలాలు
- 700 ఫీట్ల వరకు బోర్లు వేసినా కనిపించని నీటి ఊటలు
- ఆందోళనలో రైతులు

### ఎండుతున్న పంటలను కాపాడాలి..

నాకున్న రెండెకరాల్లో వరి పంట వేసిన. సాగునీరు అందక పంటంతా ఎండిపోయింది. మా గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో పంటలన్నీ ఎండిపోతున్నయి. పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి. కాలువలు చేసి నీటిని అందిస్తే పంటను కాపాడుకోగలుగుతాం. ఎండిపోయిన పంటలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలి.

**-విష్ణునాయక్, పాటితండా**



### ఎండిన పంటలో గొర్లు మేపుతున్నా..

యాసంగిలో ఎప్పుడు వేసినట్లే నాకున్న మూడెకరాల్లో వరి పంట వేసిన. సాగునీరందక మొత్తం ఎండిపోయింది. బోర్లలో నీళ్లు అంతంత మాత్రంగానే వస్తుండడంతో పంటకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. దీంతో పంట ఎండిపోతుండడంతో చేసేదేమీ లేక వదిలేసిన పంటలో గొర్లను మేపుకొంటున్న. పొలం కోసం చేసిన ఖర్చు రూపాయి కూడా మిగుల కుండా పోయింది. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు మీద పడ్డాయి. ఏం చేయాలో అర్థమైతలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

**-నాగుల నర్సయ్య, రైతు, దుబ్బాక, ధర్పల్లి మండలం**

‘యాసంగి’ సాగేదెలా?

# అడుగంటిన ఆశలు

***ఉమ్మడి జిల్లాలో** చేతికివచ్చే దశలో పంటలు ఎండిపోవడం రైతులను బాధిస్తున్నది. ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి సాగుచేస్తున్న పంటలు నీరందక ఎండిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. అందుబాటులో ఉన్న జలవనరులను ఉపయోగించుకోవాలనుకుంటున్నా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వాటిల్లోనూ నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. కనీసం బోర్ల ద్వారా పంటను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేయించగా.. నీటి జాడలు కనిపించని దుస్థితి నెలకొన్నది. ఇందల్వాయి, ధర్పల్లి మండలాల్లో రైతులు సాగునీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందల్వాయి మండలంలోని ప్రతి గ్రామంలో కనీసం 20 ఎకరాల్లో సాగునీరందక పంటలు ఎండిపోయినట్లు తెలుస్తోంది. వరి పంటపొట్ట దశలోనే ఎండిపోతున్నది.*

*–ఇందల్వాయి/ ధర్పల్లి, మార్చి 12*

**ఒక్కో** రైతు కనీసం నాలుగెకరాల వరకు పంట నష్టపోయాడు. పంటను కాపాడుకోవడానికి చివరి ప్రయత్నంగా బోర్లు వేసినా ఫలితం లేకపోయింది. సగటున 650, 700 ఫీట్ల లోతువరకు బోరుబావులు వేయించినా చుక్కనీరు రాకపోవడంతో బోర్లతోపాటు పంటకు వెచ్చించిన డబ్బులు వృథా అవుతున్నాయని రైతులు గుండెలు బాదుకుంటున్నారు.కొన్ని బోర్లు కుళాయి నీటి కన్నా అధ్వాన్నంగా పోస్తున్నాయి. దీంతో వేసిన పంటలు చేతికందడం గగనంగానే మారింది. వేసిన పంటల్లో ఇప్పటికే సగం వదిలిపెట్టుకోగా, మిగతా సగం పంటలనైనా కాపాడుకునేందుకు రైతన్నలు నానా తంటాలు పడుతున్నారు. ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామ పరిధిలో వరి పంట ఎండిపోతున్నది. చివరి తడుల కన్నా ముందుగానే కొద్దిమేర ఎండిపోగా ప్రస్తుతం చివరి తడులకు వచ్చే వరకు అంతకంతకూ ఎండిపోతున్నాయి. దీం తో కొందరు రైతులు ఎండుతున్న పంటలను పశువులు, గొర్రెలు, మేకలకు మేతగా వదిలేస్తున్నారు. దుబ్బాక గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎండిన వరి పంటలో గొర్రెలను మేపుతున్నారు.

### ట్యాంకర్ల ద్వారా అంతంతే..

కొంతమంది రైతులు తమ పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించినా ప్రయోజనం లేకుండా పోయింది. ట్యాంకర్లను రోజువారీగా అద్దెకు తీసుకొని పంటలకు నీటి సరఫరా చేయాలంటే ఖర్చు తడిసిమోపెడవుతున్నది. సాగునీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా..అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎండిపోయిన పంట నివేదికను రూపొందించి; ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇందల్వాయి మండలంలో 245 ఎకరాలు పూర్తిగా ఎండిపోయినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు.

### మూడు బోర్లు వేయించినా చుక్కనీరు రాలే..



నేను పండించిన వరి పంట చేతికచ్చే దశలో ఎండిపోయింది. నాలుగెకరాల్లో వరి వేసిన. అందులోని ఒకటిన్నర ఎకరం ఎండిపోయిందని మూడు బోర్లు వేయించిన. చుక్కానీరు రాలేదు. 600 ఫీట్ల వరకు బోర్లు వేసినా ఫలితం లేదు. ఉన్న పొలమైనా చేతికి వస్తుందన్న ఆశ లేకుండా పోయింది.

**-అమీర్‌నాయక్, మెగ్యానాయక్ తండా**

### నష్టపోయిన పంటకు పరిహారమందించాలి



నేను రెండున్నర ఎకరాల్లో వరి పంట వేసిన.సాగునీరందకపోవడంతో రెండున్నర ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. బోరు వేసినా చుక్కనీరు రాని పరిస్థితి. చేసేదేమీ లేక వదిలేసిన. గ్రామంలోని పశువులకు దాణాగా మారింది. ప్రభు త్వం నష్టపరిహారాన్ని లెక్కించి ఆర్థికంగా ఆదుకోవాలి.

**-బాదావత్ రాములు, కేకే తండా**

## తెలంగాణ అస్తిత్వానికి ముప్పు

- టీయూ పేరు మార్చేందుకు యత్నాలు?
- సర్కారు చెంతకు ప్రతిపాదనలు
- ‘ఈశ్వరీబాయి’గా నామకరణం చేసే అవకాశం
- మండిపడుతున్న విద్యార్థి, ఉద్యమ సంఘాలు
- పేరు మార్చితే పోరాటాలు తప్పవని హెచ్చరిక



వర్సిటీ పేరు మార్చవద్దని టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 12: తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చనున్నారనే ప్రచారం ఉమ్మడి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. మన ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి ప్రతీక అయిన ‘తెలంగాణ’ను మార్చాలన్న ప్రతిపాదనలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే విద్యార్థి లోకం భగ్గుమంటున్నది. విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పట్టాయి. రెండ్రోజులుగా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు చేపట్టాయి. బీఆర్‌ఎస్వీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీసీ విద్యార్థి సం ఘం పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. ఈశ్వరీబాయ్ యూనివర్సిటీగా మార్చాలన్న ప్రతిపాదనలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఉద్యమం లేవదీస్తామని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి.

### పేరు మార్చేందుకు?

యూనివర్సిటీ కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గతంలో అనేక పోరాటాలు జరిగాయి. వర్సిటీ సాధన పోరులో అనేక మంది విద్యార్థి నేతలు జైళ్లకు వెళ్లారు. లాఠీదెబ్బలు తిన్నారు. అయినప్పటికీ ఎక్కడా వెనక్కు తగ్గలేదు. దీంతో దిగివచ్చిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అలా 2006లో నిజామాబాద్ గడ్డ మీద తెలంగాణ యూనివర్సిటీ పురుడు పోసుకున్నది. అప్పటికే స్వరాష్ట్ర కాంక్షతో ఉద్యమం జోరుగా సాగుతున్న రోజులవి. పక్కా సమైక్యవాది అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణ పేరిట యూనివర్సిటీని ప్రా రంభించారు. అలాంటిది స్వరాష్ట్ర కల సాకారమై దశాబ్ద కాలం గడిచిన తర్వాత ఇప్పుడు రేవంత్ సర్కారు ఇప్పుడు ‘తెలంగాణ’ అస్తిత్వమే లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నది. తెలంగాణ యూనివర్సిటీని ఈశ్వరీబాయి విశ్వవిద్యాలయంగా మార్చే కుట్రకు తెర లేపుతున్నది.

### విద్యార్థి సంఘాల పోరుబాట..

తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తుండడంపై విద్యార్థి, ఉద్యమ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వరీబాయ్ పేరు పెట్టాలని ప్రతిపాదిస్తుండడంపై మండిపడుతున్నాయి. ఎవరు అధికారంలోకి వస్తే వాళ్ల తల్లిదండ్రుల పేర్లు ప్రభుత్వ సంస్థలకు పెట్టుకోవడం పద్ధతి కాదని విమర్శిస్తున్నాయి. రేవంత్ ప్రభుత్వం తక్షణమే ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని, లేకపోతే ఉద్యమం తప్పదని బీఆర్ఎస్వీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ తదితర సంఘాలు హెచ్చరిస్తున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చడమంటే రాష్ట్రాన్ని అవమానించడమేనని ఉద్యమ సంఘాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ కొట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడితే పోరాటాలు తప్పవని స్పష్టం చేస్తున్నాయి.

### పేరు మార్చితే ఊరుకోం..

త్యాగాలకు ప్రతీకగా భావించే ‘తెలంగాణ’ను కాదని యూనివర్సిటీకి మరోపేరు పెడతామంటే ఊరుకునేది లేదని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అమృత్‌చారి అన్నారు. వర్సిటీ పేరు మార్పుపై వచ్చిన నివేదికను ప్రభుత్వం తిరస్కరించాలన్నారు. పేరు మార్పుపై దృష్టి పెట్టడానికి బదులు వర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్థానంలో కాంగ్రెస్ నాయకురాలు ఈశ్వరీబాయి పేరును వర్సిటీకి పెట్టాలని ప్రతిపాదించడం దురదృష్టకరమన్నారు. ఆ ప్రయత్నాలను మానుకోవాలని, లేకపోతే ఉద్య మం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రం పేరుతో ఏర్పడిన ఏకైక వర్సిటీ ఇదేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ అన్నారు. ఎంతో చరిత్ర కలిగిన వర్సిటీ పేరు మార్చడమంటే ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభు త్వం అవమానించడమే అవుతుందన్నారు. వర్సిటీ పేరు మారిస్తే సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలి పోవడం ఖాయమన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలి తప్ప పేరు మార్చే అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ అంటే ఉద్యమానికి ప్రతీక అని, అలాంటిది వర్సిటీ పేరు మార్చి ఈశ్వరీబాయి పేరు పెడతామనడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. 1960 నుంచి 2014 వరకు సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలంగాణ పేరును మార్చడమంటే రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీయడమే అవుతుందన్నారు.

## ‘ఆర్టీఏ’లో దళారుల దందా
# నిఘా పెట్టిన ఏసీబీ




- ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు విస్తృత తనిఖీలు
- ఎవరూ బయటికి వెళ్లకుండా మెయిన్‌గేట్‌కు తాళం
- ఓ ఏజెంట్ నుంచి రూ.27వేల నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం
- పత్తాలేని డీటీసీ..సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్
- జిల్లా రవాణా కార్యాలయంలో ‘దళారుల దందా’కు చెక్

వినాయక్‌నగర్, మార్చి 12 : నిజామాబాద్ రవాణా కార్యాలయం దళారులకు అడ్డాగా మారింది. వారు చెప్పిందే అక్కడి సిబ్బంది పాటించడం పరిపాటిగా మారింది. డబ్బులిచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తూ పనులు చేసి పెడుతున్నారు. ఆర్టీఏ సిబ్బంది సహకారంతో దళారులు రెచ్చిపోతుండడం, నేరుగా వచ్చిన వారి పనులు పూర్తికాకపోవడంతో విసిగివేసారిపోయిన కొందరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయంపై బుధవారం ఏసీబీ అధికారుల దాడి కలకలం సృష్టించింది. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు.

ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది నాగారం పరిధిలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ఉదయం 11 గంటల ప్రాంతంలో చుట్టుముట్టారు. కార్యాలయం లోపల, వెలుపల ఉన్న సిబ్బందితోపాటు ప్రైవేటు వ్యక్తులను ఎక్కడికక్కడే కట్టడి చేశారు. లోపల నుంచి బయటికి, బయటి నుంచి లోపలకు ఎవరినీ వెళ్లకుండా నిలువరించి, ప్రధాన గేట్‌కు తాళం వేసి విస్తృతంగా సోదాలు చేపట్టారు. సోదాల్లో ఎండీ ఖలీల్ అనే ఏజెంట్ నుంచి రూ.27 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు. 14 వివిధ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్, ముగ్గురు వ్యక్తులకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. సోదాలు రాత్రి 10 గంటల వరకు ఏకధాటిగా కొనసాగాయని, కార్యాలయంలో లభించిన పత్రాలతోపాటు రికార్డుల వివరాలను సైతం తమ రిపోర్టులో నమోదు చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

### ఒక్కో పనికి ఒక్కో కోడ్ ద్వారా వసూళ్లు..

రవాణా శాఖ కార్యాలయంలో ఏమైనా పనులు జరగాలంటే ఇక్కడ అధికారులు మొదలుకొని కింది స్థాయి సిబ్బంది వరకు తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు వ్యక్తులను ఏజెంట్‌లుగా నియమించుకున్నట్లు సమాచారం. కార్యాలయంలో వాహనాలకు సంబంధించిన ఎలాంటి పనులు జరగాలన్నా ఆ పనిని బట్టి ఒక కోడ్ ద్వారా డబ్బులు వసూలు చేయడం గమనార్హం. దళారులు ఆర్టీవో కార్యాలయంలో ఉద్యోగి మాదిరిగా కలియదిరుగుతూ ప్రత్యేక కోడ్‌ను వాహనాల పత్రాలపై రాసి, దాని ద్వారా వసూళ్లలకు పాల్పడుతున్నట్లు ఏసీబీ అధికారుల సోదాలో బహిర్గతమైంది. తనిఖీల సందర్భంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్ని ప్రభుత్వానికి అందజేసే నివేదికలో పొందుపర్చనున్నట్లు ఏసీబీ అధికారి వెల్లడించారు.

### పత్తాలేని డీటీవో

కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలో నిజామాబాద్ డీటీవో దుర్గాప్రమీల అందుబాటులో లేరని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆమె మొబైల్ సైతం స్విచ్ఛాఫ్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఆమె సెలవులో ఉన్నట్లు రికార్డులోకూడా లేదని తెలిపారు.

## బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు.






## వీఆర్‌ఏల ముందస్తు అరెస్టు

మాక్లూర్, మార్చి 12 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు బుధవారం గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ మేరకు మాక్లూర్ మండలంలోని వీఆర్‌ఏలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ.. 61 ఏండ్లు నిండిన వారసులకు జీవో నంబర్ 81, 85 ప్రకారం ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## మాజీ సర్పంచుల నిర్బంధం



భిక్కనూర్ పోలీసుస్టేషన్‌లో మాజీ సర్పంచులు

*గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఏడాదైనా రాకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాయింట్ కమిటీ ‘అసెంబ్లీ ముట్టడి’కి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మాజీ సర్పంచులను బుధవారం పోలీసులు అడ్డుకున్నారు. లింగంపేట, ఎడపల్లి, బోధన్, మాచారెడ్డి, భిక్కనూర్ మండలాల్లో మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.*

*– నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి12*